క్లుప్తంగా

శాస్త్రోక్తంగా హనుమద్ హోమం


హనుమద్ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం హనుమద్ హోమం అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో హనుమద్ హోమాన్ని ప్రతి ఆదివారం భక్తులకు ఆర్జిత సేవగా దేవస్థానం నిర్ణయించిందని ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. ఈ హోమంలో భక్తులంతా పాల్గొనాలని ఆమె కోరారు. హోమ కార్యక్రమాన్ని ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ పర్యవేక్షించారని తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాల వెల్లువ


దాత కృష్ణమోహన్‌కు విరాళం బాండ్ అందిస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఆదివారం విరాళాలు వెల్లువెత్తాయి. ముగ్గురు భక్తులు వేరువేరుగా రూ.4,26,348 అందజేశారు. వేగవరానికి చెందిన ఎన్‌వీవీఎస్ ఎస్ఎస్ కృష్ణమోహన్ రూ.2,25,116, విశాఖపట్నానికి చెందిన కాశిన వెంకటేశ్వరరావు రూ.1,00,116, హైదరాబాద్‌కు చెందిన పోతిన ప్రకాష్ రూ.1,01,116 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతల కుటుంబాలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాలను అందజేశారు. వారికి స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

ధర్మరాజుకు అభినందనలు


ధర్మరాజుకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా మాజీ ఎంపీటీసీ సభ్యుడు కుక్కల ధర్మరాజును నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జెట్టి గురునాథరావు స్థానిక కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులు గురునాథరావు, మండల, పట్టణ అధ్యక్షులు కర్పూరం గుప్తా, ఓరుగంటి నాగేంద్రలు ధర్మరాజును దుశ్శాలువాతో సత్కరించి, అభినందించారు. వీరిలో నాయకులు జెట్టి సత్య ఆదిత్య, ముప్పిడి శ్రీనివాసరావు ముప్పిడి వీరాంజనేయులు, బత్తిని చిన్న, అయినాల రమణమూర్తి, కొయ్య లీలాధర్‌రెడ్డి, తాడేపల్లి ఉమా, పంతగాని వెంకన్న, గంజి వినోద్, నేకూరి కిషోర్, షరీఫ్, అడబాల రాంబాబు, పాములపర్తి శ్రీనివాసు, హీరా హకీమ్, హఫీజ్, కత్తి వసంత్, కాసర సోమిరెడ్డి, పెసరకంటి త్రిమూర్తులు, మొగల్నీడి శ్యాం, దున్న శివ, కసింకోట సతీష్, దోనేపూడి రమణ ఉన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ధర్మరాజు తెలిపారు.

ఉచిత బస్సు పేరుతో మోసం

దెందులూరు: ఉచిత బస్సు పేరిట మహిళలను కూటమి ప్రభుత్వం మరోసారి మోసం చేసిందని ఏలూరు జెడ్పీటీసీ మండల సరస్వతి ఆరోపించారు. ఆదివారం శ్రీపర్రులో ఆమె మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీ ల్లో ఒకటైన ఉచిత బస్సు రాష్ట్రమంతా ఫ్రీ, ఏ కండక్టర్ డ్రైవర్ అని అడిగితే తన పేరు చెప్పండి అని పదేపదే హామీలు ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పథకం ప్రారంభించి ఇప్పుడు తిరుపతికి ఉచిత బస్సు లేదని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ నిర్ణయం మహిళలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు.

ముక్కు మూసుకోవాల్సిందే!

- డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్త
- వెదజల్లుతోన్న దుర్గంధం
- ప్రజలకు వ్యాధుల భయం


చింతలపూడి నుంచి టి.నరసాపురం వెళ్లే రోడ్డులో తగలబడుతున్న చెత్త


కొప్పల వారివీధిలో డ్రెయిన్‌లో నిలిచిన మురుగు నీరు, చెత్త

చింతలపూడి : ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. డ్రెయినేజీల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు పెరిగిపోయి ప్రజలను జ్వరాల భయం వెంటాడుతోంది. ప్రధానంగా చింతలపూడి నగర పంచాయతీ నుంచి కొన్ని ప్రధాన రహదారులపై ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే. ఇందుకు పట్టణంలోని చెత్తా చెదారం ఈ రోడ్లపై పోస్తుండటం, వాటి నుంచి దుర్గంధం వెదజల్లుతుండడమే కారణం. ముఖ్యంగా టి.నరసాపురం వెళ్లే రహదారిపై టన్నుల కొద్దీ చెత్త పోస్తున్నారు. దీనిని వారానికి ఒకసారి తగలబెడుతున్నారు. తద్వారా వచ్చే పొగ, వేడి గాలులకు ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

డంపింగ్ యార్డు లేక..

నగర పంచాయతీకి సరైన డంపింగ్ యార్డు లేదు. దీంతో ప్రతి రోజూ వచ్చే టన్నుల కొద్దీ చెత్తను రోడ్లపై పోస్తున్నారు. వీటిల్లో పందులు చేరి అంటు వ్యాధులకు కారణమవుతున్నాయి. కనీసం బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ చేయడంపైనా అధికారులు శ్రద్ధ చూపడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు బయటికి పోయే దారిలేక గ్రామాల్లో అపారిశుధ్యం గోచరిస్తోంది. పలు రహదారుల్లో రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగిపోయి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పిచ్చి మొక్కలు, పొదలను తొలగించాలని వారు కోరుతున్నారు.

పంచాయతీల్లో అపారిశుద్ధ్యం

జంగారెడ్డిగూడెం మండలంలో అనేక పంచాయతీల్లో అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. కొన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్యం పనులు చేస్తున్నా, ఎక్కువ పంచాయతీల్లో పనులు చేపట్టడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్యం క్షీణించడంతో డ్రెయిన్లలో మురుగు నీరు నిలిచి దోమలు పెరిగిపోతున్నాయి. ఎక్కడ వ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మురుగు, చెత్తా చెదారాలను తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

మెట్ట ప్రాంతంలో విష జ్వరాలు విజంభిస్తున్నాయి. గత 10 రోజులకుపైగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు, వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా పిల్లలు, పెద్దలు జ్వరాల బారిన పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. టైఫాయిడ్, మలేరియ, వైరల్ విషజ్వరాలతో ఆసుపత్రుల వద్ద బారులు తీరుతున్నారు. పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. పట్టణాల్లో మురుగు డ్రెయిన్లను శుభ్రం చేయకపోవడం, మండలంలోని ప్రతి గ్రామంలోనూ పారిశుద్ధ్యం నిర్వహణ అంతంత మాత్రంగానే ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రజారోగ్యంపై శ్రద్ధేదీ?



ప్రస్తుత ప్రభుత్వం ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. వర్షాలు ఎక్కువగా కురవడంతో గ్రామాల్లో దోమల పెరిగి అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం నిధులు కేటాయించి ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా చర్యలు చేపట్టాలి. దోమల నివారణకు చర్యలు చేపట్టడంతో పాటు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్య శాఖ పని చేయాలి.

– ఎం గురుబ్రహ్మం, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు

అప్రమత్తంగా ఉండాలి

జంగారెడ్డిగూడెం: గోదావరిలో చేపల వేటకు వెళ్లే డివిజన్‌లోని మత్స్యకారులు గోదావరి వరదల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ ఆర్‌వీ రమణ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అల్పపీడన ప్రభావంతో గోదావరి నదీపరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి నీటి మట్టం పెరుగుతోందని తెలిపారు. మత్స్యకారులు, ప్రజలు నదిలోకి వెళ్లరాదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: నిమ్మలగూడెం సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. నిమ్మలగూడెం, టిక్కనవారిగూడెం గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

కన్నాయిగూడెం ఫీడర్ పరిధిలో..

కొయ్యలగూడెం: అరిపాటి దిబ్బలు (కనకాద్రిపురం) సబ్‌స్టేషన్‌లోని కన్నాయిగూడెం ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో డీఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. పొంగుటూరు, కన్నాయిగుడెం గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు


ఆలయానికి విరాళం అందిస్తున్న భక్తులు

కొయ్యలగూడెం: స్థానిక తాడేపల్లిగూడెం రోడ్డులోని స్వయంభూగా వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నూతన నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ తాడికొండ మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. ఈ నిర్మాణం మరో మూడు నెలలలో పూర్తవుతుందన్నారు. పి.కృష్ణప్రసాద్, వెంకటలక్ష్మి నాగవల్లి దంపతులు, పి.రమేష్ బాబు, జ్యోత్స్న దంపతులు రూ.1,11,111 అందజేశారని చెప్పారు. జంగారెడ్డిగూడెంకు చెందిన బుగ్గా వెంకటరమణ, రాధిక దంపతులు రూ.25,116, కొయ్యలగూడెంకు చెందిన కోన దయరాజు రూ.25,000, మలిశెట్టి దుర్గాప్రసాద్ రూ.10,116, సలాది శ్రీనివాసు, నారాయణమూర్తిలు రూ.10,116, డాక్టర్ జీవీవీ సత్యనారాయణ (డాక్టర్ బాబురావు) రూ.10,111, పెనుగొండ శ్రీనివాస్ రూ.5,116, గవరానికి చెందిన గోపీ గోపాలకృష్ణ, వీర వెంకట లక్ష్మి దంపతులు రూ.10,116 విరాళంగా అందించారని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

23, 24వ తేదీల్లో వాలీబాల్ పోటీలు

జంగారెడ్డిగూడెం: గ్రామీణ యువతను ప్రోత్సహించి క్రీడా స్ఫూర్తిని పతాక స్థాయికి తీసుకెళ్లాలన్న మహోన్నత ఆశయంతో గత 16 సంవత్సరాలుగా ఇషా ఫౌండేషన్ ప్రతిష్టాత్మకంగా గ్రామోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఇషా ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం జంగారెడ్డిగూడెంలో వారు మాట్లాడుతూ గారెడ్డిగూడెం గవర్నమెంట్ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించే వాలీబాల్ పోటీలకు 14 ఏళ్ల పైబడిన గ్రామీణ యువత అర్హులని పేర్కొన్నారు. క్లస్టర్ స్థాయిలో విజేతలకు మొదటి, రెండు, మూడు, నాలుగో బహుమతులుగా రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు అందజేయనున్నట్టు వివరించారు. విజేతలు డివిజన్ స్థాయిలో సెప్టెంబర్ నెలలో గుంటూరులో జరిగే పోటీల్లో పాల్గోవాల్సి ఉంటుందని తెలిపారు. ఫైనల్ పోటీలు తమిళనాడులోని కోయంబత్తూరులో సెప్టెంబర్ 21న నిర్వహిస్తారని వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు ఇషా ఫౌండేషన్ వలంటీర్ల ఫోన్ నంబర్లు 95819 01043, 93461 87098లో సంప్రదించాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు


ఎరగ్రుంటపల్లిలో రోగులను పరీక్షిస్తున్న దృశ్యం


గండిగూడెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

చింతలపూడి : లయన్స్ క్లబ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అడపా శ్రీనివాస రావు తెలిపారు. ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్ లైఫ్ ఆసుపత్రి వైద్యులు మండలంలోని ఎరగ్రుంటపల్లిలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని శ్రీనివాసరావు తెలిపారు. డాక్టర్లు మద్దాల చైతన్య, జ్యోత్స్న, దినేష్ గుప్తా, లయన్స్ జిల్లా సభ్యులు పాల్గొన్నారు.

గండిగూడెంలో ఉచిత వైద్య శిబిరం

కామవరపుకోట: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఎంసీ హాస్పిటల్ (పెదవేగి) వారిచే కళ్లచెరువు పంచాయతీ గండిగూడెం గ్రామంలో మెగా జనరల్ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, న్యూరాలజీ, గైనకాలజిస్ట్ సంబంధించిన వైద్యనిపుణులు సుమారు 155 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని మానవత శాఖ ప్రెసిడెంట్ పావులూరు చంద్రలాల్ గాంధీ, సర్పంచ్ నౌడు సత్తిబాబు ప్రారంభించారు. మానవత చైర్మన్ గంగాధర ప్రసాద్, గారపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం సాకులు చెప్పడం సరికాదు


నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కుక్కునూరు: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు వర్తింపజేయకపోవడంపై ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె కుక్కునూరులో విలేకరులతో మాట్లాడారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై షరతులు పెట్టడం సరికాదన్నారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటినా విలీన మండలాలపై ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపుతోందని విమర్శించారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం కుంటిసాకులు చెప్పడమేంటని ప్రశ్నించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో అంతరాష్ట్ర బస్సు సర్వీసు పేరుతో నిలిపివేయకుండా ఉచిత బస్సు ప్రయాణాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చంద్రకళ, పద్మ, రమ్య, తిరుపతమ్మ, లక్ష్మి, భవాని, హైమవతి తదితరులు పాల్గొన్నారు.

● కమ్మేసిన కారుమబ్బులు


తుఫాను ప్రభావంతో ఆకాశంలో నల్లటి కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఆకాశం నల్లని మేఘాలతో దిగువకు జారుతున్నట్టు సుందర దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో ఎత్తైన పచ్చని కొండల నుంచి కారు మబ్బులు నది వరకు చేరుకున్న ఆహ్లాద దృశ్యమిది. ఇది చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.

– పోలవరం రూరల్

నేటి నుంచి పవిత్రోత్సవాలు


లక్ష్మీపురం శ్రీనివాసుడు


ఐఎస్ జగన్నాథపురం నారసింహుడు

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవారి ఉపాలయమైన లక్ష్మీపురం ఆలయంలో సోమవారం నుంచి, దత్తత ఆలయమైన ఐఎస్ జగన్నాథపురం ఆలయంలో మంగళవారం నుంచి దివ్య పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో 18న అర్చకులు అంకురార్పణతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారన్నారు. 19న పవిత్రాధివాసం, 20న పవిత్రారోహణ, 21న పవిత్రావరోహణ, మహా పూర్ణాహుతి నిర్వహిస్తారు. వీటితో నాలుగు రోజుల ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయి. ఐఎస్ జగన్నాథపురం సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో 19న అంకురార్పణ, 20న పవిత్రారోపణ, 21న పవిత్ర విసర్జన, మహా పూర్ణాహుతి వేడుకలు నిర్వహించనున్నారు. ఏడాది పొడవునా ఆలయాల్లో తెలిసీ తెలియక జరిగే తప్పుల ప్రాయశ్చిత్తం నిమిత్తం ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

ముమ్మరంగా వరినాట్లు


పట్టిసీమ ఔట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి నదిలోకి చేరుతున్న కొవ్వాడ అధిక జలాలు

పోలవరం రూరల్: అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రైతాంగం ముమ్మరంగా వరినాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. గత రెండు నెలలుగా వర్షాలు లేక, నాట్లు పడక, చెరువులు నిండకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాలతో కొండవాగులు ఇప్పుడిప్పుడే పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండు కుండలా మారుతున్నాయి. కొవ్వాడ కాలువ, పేడ్రాల, నక్కల గొయ్యి, ఇసుక కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొవ్వాడ కాలువ అధిక జలాలు పట్టిసీమ ఔట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి నదిలోకి చేరుతున్నాయి. ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్ కూడా 84 మీటర్లకు చేరుకుంది. వర్షాలు ముమ్మరంగా కురుస్తుండటంతో పంట పొలాలు నాట్లు వేసి కళకళలాడుతున్నాయి.

ఆక్వా రంగాన్ని కాపాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న రవి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ట్రంప్ సుంకాలు తగ్గించుకోవాలని, ఆక్వా రంగాన్ని కాపాడాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనం వీడాలని వక్తలు డిమాండ్ చేశారు. ట్రంప్ సుంకాలు ఆక్వా కుదేలు అనే అంశంపై స్థానిక పవరుపేటలోని సీపీఎం ఏలూరు జిల్లా కార్యాలయంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన నిర్వహించారు. రవి, సీపీఐ ఏలూరు జిల్లా సమితి కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, కాంగ్రెస్ జిల్లా నాయకుడు రాజనాల రామ్మోహనరావు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతదేశం నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న వ్యవసాయ, ఆక్వా తదితర ఉత్పత్తులపై పన్నులు 50 శాతం పైగా వేయటంతో ఆక్వా పరిశ్రమ ఒక్కసారిగా కుదేలైందన్నారు. అమెరికా పన్నుల బూచి చూపి ట్రేడర్లు, కంపెనీలు ధర తగ్గించి కొంటున్నారని, రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్వా రంగంపైనే కాకుండా దేశంలో వ్యవసాయ ఉత్పత్తులపై కూడా ట్రంప్ సుంకాల ప్రభావం పడుతోందన్నారు. అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా గతంలోవలె కౌంటుల వారీగా ధరలు నిర్ణయించి ఎక్స్‌పోర్టర్లు, ట్రేడర్లతో అమలు చేయించాలని డిమాండ్ చేశారు. మార్కెట్ జోక్యం పథకం (ఎంఐఎస్) ద్వారా సబ్సిడీ ధర ఇవ్వాలని, నాణ్యమైన సీడ్, ఫీడ్ అందేల చూడాలని, ధరలు నియంత్రించాలని, విద్యుత్ రాయితీ, ట్రాన్స్ ఫార్మర్లు ఇవ్వాలని, దేశంలో వినియోగం పెరిగేలా (డొమెస్టిక్) చర్యలు తీసుకోవాలని, మార్కెట్ యార్డుల్లో, సొసైటీల్లో శీతల గిడ్డంగులు నిర్మించి రైతాంగానికి అందుబాటులోకి తేవాలని, కేంద్రం ఎక్స్‌టెన్సీ నిధులు ఇచ్చి ఆక్వా ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కె.శ్రీనివాస్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదం తెలిపారు.